క్లుప్తంగా

డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని వినతి



మంగళగిరి: పట్టణంలోని కొత్తపేటలో డ్రైనేజి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ శకుంతలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్తపేటలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం వలన రోడ్లపైకి మురుగు నీరు చేరి దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నందం బ్రహ్మేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, వల్లభాపురం నాగేశ్వరరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం



మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంబడి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సెంటినీ సిటీ హాస్పిటల్ సహకారంతో గుండె, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి బెటాలియన్‌లో అధికారులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ నరాలశెట్టి అనిల్, ఊపిరితిత్తుల వ్యాధుల డాక్టర్ ఎస్వీ శివప్రసాదరెడ్డి, ఏపీఎస్పీ కమాండెంట్ నగేష్ బాబు, అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్ హనుమంతప్ప, అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణారావు, పావనరావు, సెక్రటరీ జీబీకే గోవర్ధన్, ట్రెజరర్ ఎస్ఎస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎమ్మెస్కే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్



మంగళగిరి: మండలంలోని చినకాకాని శివారు ప్రాంతంలోని రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపిన వివరాల మేరకు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.20,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడం జరుగుతుందన్నారు. రూరల్ స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందేలు ఇతర చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న చక్కా రమణమ్మ, బొమ్మన కొండలరావులు బదిలీపై వెళ్లడంతో సోమవారం వారిని పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ మాజీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను ఉపాధ్యాయులు అందించారని చెప్పారు. అనంతరం వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.రత్నబాబు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎ.ఇమ్మానియేల్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చెలికాని దినేష్, వైస్ చైర్మన్ షేక్ కరిష్మా, ఉపాధ్యాయులు ఏవీవీ లక్ష్మి, షేక్ మహబూబ్ సుభాని, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వాటర్ ప్లాంట్ ప్రారంభం



దుగ్గిరాల: శరీరంలోని ఎసిడిటీని తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆల్కలైన్ వాటర్ దోహద పడుతుందని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పునర్జన ఫార్మా ప్రైవేటు లిమిటెడ్ ఎండీ బొమ్ము తాతిరెడ్డి అన్నారు. మండలంలోని వీర్లపాలెంలో బొమ్ము రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆల్కలైన్ మినరల్ ప్లాంట్‌ని ప్రారంభించారు. తాతిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధంగా, గ్రామీణ స్థాయిలో ఆల్కలైన్ తాగునీటి ప్లాంట్‌ను ఉచితంగా ప్రారంభించామని, ఈ నీటి ద్వారా మానవ ఆరోగ్య ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు.

బాబు పాలనలో భవిష్యత్తుకు గ్యారంటీ లేదు

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి తదితరులు

మంగళగిరి: బాబు పాలనలో ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ లేదని నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని నూతక్కి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు తన పాలనలో ఏనాడైనా ప్రజల భవిష్యత్తు గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. బాబు ష్యూరిటీ అంటే తన కుమారుడికి, తన బినామీలకు, కార్పొరేట్ కంపెనీలకు అన్నారు. గత ఎన్నికలలో సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అన్ని ప్రజలకు అందజేశామని, ఇక ఎవరైనా సూపర్‌సిక్స్ అంటే వారిపై చర్యలు తప్పవంటూ ప్రజలను భయపెడుతున్నారన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు రైతులకు భరోసా ఉండదని సభలోనే చెప్పడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం సగం మంది విద్యార్థులకు ఎగ్గొట్టారన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగ కల్పన అని రెండు వేల మందికి కూడా ఇవ్వలేదన్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా నగదు అంది ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. బాబు అబద్ధపు హామీలతో మోసపోయిన మహిళలు వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి హాజరై ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ప్రభుత్వంపై ఏడాది కాలంలోనే ఇంత వ్యతిరేకత ఎన్నడూ చూడలేదన్నారు. బాబు పాలనపై త్వరలోనే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయన్నారు. క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార విభాగం సెక్రటరీ ఈపూరి ఆదామ్, నియోజకవర్గ ఇంటలెక్చువల్ విభాగ అధ్యక్షుడు జంగా నాగిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొండమడుగుల గోపిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మండల ఎస్టీ విభాగం అధ్యక్షుడు దుర్గానాయక్, గ్రామ అధ్యక్షుడు ఆరెకూటి కూర్మారెడ్డి, మాజీ సర్పంచ్ భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే శిశువుకు ఆరోగ్యం



కృష్ణానగర్‌లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహనా ర్యాలీ



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగనవాడీలు

తాడేపల్లిరూరల్: తల్లిపాలే శిశువుకు ఆరోగ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ శిరోమణి అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ పెనుమాక సెక్టార్‌లోని కృష్ణానగర్‌లో 5, 6 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిరోమణి మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లి తప్పనిసరిగా బిడ్డకు పాలు ఇవ్వాలని, తల్లిపాలు ఇవ్వడం వలన తల్లి క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని వివరించారు. పిల్లల్లో తెలివితేటలు మెరుగుపడతాయని తెలిపారు. శిశువు జన్మించిన వెంటనే ముర్రుపాలు అందజేయాలని సూచించారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ తల్లిపాలపై స్లోగన్స్ చెబుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 5, 6 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు బొందలపాటి సుజాత, వి.లీల, వీఆర్‌వోలు, ఏపీఎం మహాలక్ష్మి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి

మంగళగిరి: బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని సూపర్‌వైజర్ భవాని తెలిపారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట అంగనవాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

దుగ్గిరాల: తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని వైద్యాధికారి ఎండీ రెహమున్నీసా అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం ఈమని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధకతను పెంచుతాయని, తల్లిపాలలో ఎన్నో పోషకాలు ఉండి శరీర ఎదుగుదలకు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో స్వరూపరాణి, ఏఎన్ఎం సత్యవతి, పి.శిరీష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆశావర్కర్లు

రాజధాని రైతులను కలుసుకోవడం ఆనందంగా ఉంది

రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ, సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తాడికొండ: రాజధానికి భూములిచ్చిన రైతులను కలుసుకోవడం ఆనందంగా ఉందని, చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రం కోసం భూమి ఇవ్వడం ఓ చరిత్ర అని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ, సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిన్న చిన్న సమస్యలు చెప్పారని వాటిని స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పరిష్కరిస్తారన్నారు.

సీఆర్డీయే అధికారుల ఒంటెత్తు పోకడలు

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పార్టీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు మాట్లాడుతూ సీఆర్డీయే అధికారులు ఒంటెత్తు పోకడలు పోతున్నారని, సభ సాక్షిగా మండిపడ్డారు. గ్యాస్ రాయితీ తమ ఖాతాల్లో పడటం లేదని, పింఛన్‌లు అందడం లేదని పలువురు ఇంటింటా మొరపెట్టుకోగా పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులు దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలి



మంగళగిరి: మంత్రి లోకేష్ నియోజకవర్గంలో పారిశుధ్య(ఎంబుక్) కార్మికులు దోపిడికి గురవతున్నారని సీఐటీయూ నాయకుడు వేమూరు దుర్గారావు తెలిపారు. ఎంబుక్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ కార్మికులు ఒక్కొక్కరి దగ్గర రూ.5 వేలు దోచుకుంటున్నారని, అధికారులకు తెలియజేసినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు చాలీచాలని జీతంతో జీవనం కొనసాగిస్తున్నారని, కాంట్రాక్టర్ మాత్రం రూ.10 వేలు మాత్రమే ఇస్తాను.. చేస్తే చేయండి లేదంటే వెళ్లిపోవచ్చంటున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యు.దుర్గారావు, పి.బాబూరావు, కె.వెంకటేశ్వరమ్మ, ఎం.బాలాజీ, వై.కమలాకర్, నారాయణమ్మ, రజని, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సంతకాల సేకరణ

మంగళగిరి: అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని రత్నాలచెరువులో సోమవారం విద్యుత్ వినియోగదారుల నుంచి స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని, సెల్‌ఫోన్ రీచార్జి లాగా కరెంట్‌కు కూడా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 5న మంగళగిరిలోని విద్యుత్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్నవరపు ప్రభాకర్, ఆకురాతి శ్రీనివాసరావు, గంజి శ్రీనివాసరావు, పట్నాభి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సంతకాల సేకరణ

తాడేపల్లిరూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని 11, 12 వార్డులలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రజలను మరింత దోపిడీ చేయడానికి బిగించే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఇప్పటికే అనేక చోట్ల బిల్లులు అధికంగా వస్తున్నాయని, ప్రజలు వీటి దెబ్బకి బెంబేలెత్తుతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అందుకోసం 5వ తేదీ నులకపేటలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని, ఈ ధర్నాలో ప్రజల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.మల్లేశ్వరి, వి.రమణ, నాగమణి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.





సంతకాలు సేకరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు దుర్గారావు

స్మార్ట్ మీటర్లతో పేదలపై మరింత భారం

దుగ్గిరాల: పేదలపై మరింత విద్యుత్ భారాలు వేయడానికి స్మార్ట్ మీటర్లు బిగుస్తున్నారని సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని ఈమని గ్రామంలో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీ అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఫలితంగా వ్యవసాయదారులు, పేద ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ రద్దవుతుందని, వినియోగదారులపై అనేక రెట్లు విద్యుత్ భారం పడుతుందని తెలిపారు. ప్రజలకు ఉరితాళ్లగా మారనున్న అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజా సంఘాలు, పౌరసంఘాలు ఆధ్వర్యంలో 5న విద్యుత్ స్టేషన్‌ల వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వై.బాబురావు, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లు పనిచేయక ఇబ్బంది పడుతున్నాం

మంగళగిరి: అంగనవాడీ కార్యకర్తలకు గతంలో ఇచ్చిన ఫోన్లు ప్రస్తుతం పని చేయడం లేదని, వెంటనే ప్రభుత్వం కొత్త సెల్‌ఫోన్లు ఇవ్వాలని అంగనవాడీ యూనియన్ నాయకురాలు కె.హేమలత అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పెడుతున్న యాప్‌ల వలన ఫోన్‌లు పని చేయక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎఫ్ఆర్ఎస్, ఈ కేవైసీ చేయాలన్నా ఫోన్లు పని చేయడం లేదని, దీంతో సోమవారం మంగళగిరిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఫోన్‌లు తిరిగి ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : గుంటూరులో జరగనున్న 26వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. సోమవారం మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరులో ఈ నెల 17, 18 తేదీలలో జిల్లా 26వ మహా సభలను నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలను ఒకసారి జరిగే ఈ మహాసభల్లో పార్టీ పురోగతి, కార్మిక, కర్షక, ఉద్యోగ రంగ సంస్థలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. అనంతరం నాయకులతో కలసి మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, రత్నాలచెరువు శాఖ కార్యదర్శి ఆకురాతి శ్రీనివాసరావు, కొత్తపేట శాఖ సభ్యులు ఎస్కే సుభాని, బాపనపల్లి వెంకటేశ్వరరావు, నందం చిన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చిత్రలేఖనం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరావతి ఐకాన్ క్లబ్ హౌస్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని అమరావతి ఐకాన్‌లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సబ్ జూనియర్స్ విభాగంలో ప్రకృతి అంశంపై, జూనియర్స్ విభాగంలో 6, 7 తరగతులకు జాతీయ క్రీడలపై, సీనియర్స్ విభాగంలో 8, 9, 10 తరగతులకు యుద్ధము-శాంతిపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. పిల్లల్లో సృజనాత్మకశక్తి పెరగడానికి ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం, అమరావతి ఐకాన్ ప్రతినిధులు జీఎస్ఆర్ మోహనరావు, ఎం.మనోహర్ రెడ్డి, క్షితిజ, ముఖేష్, జి.సుబ్బారెడ్డి, టి.నాగేశ్వరరావు, ఆర్.నాగరాజు, బిట్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బందికి డిజిటల్ పేమెంట్‌లపై అవగాహన



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ సీఏల్ఆర్ (కాంట్రాక్ట్) మహిళా సిబ్బంది కోసం ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం డిజిటల్ పేమెంట్‌ల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సోనీ మాట్లాడుతూ సామాన్య మహిళలు సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ హక్కుల ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. డిజిటల్ సాంకేతికతలో మహిళల భాగస్వామ్యం, ఆన్‌లైన్ భద్రత, డిజిటల్ సాధికారతలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే మార్గాలను వివరించారు. వర్సిటీ ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కో కన్వీనర్ డాక్టర్ ఎన్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు. అలాగే కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్, ఈసీఈ విభాగాల ఆధ్వర్యంలో డిజిటల్ లావాదేవీలపై మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సురక్షితమైన ఆర్థిక లావాదేవీల వినియోగంపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. క్షేత్ర స్థాయి సమన్వయకర్త పి.సురేష్, వలంటీర్లను కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కె.ఆర్.ప్రసాద్ అభినందించారు.

రైల్వే ట్రాక్ పక్కన వ్యక్తి మృతదేహం



మృతి చెందిన థామస్

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సత్తెనపల్లి రోడ్డు సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన సోమవారం ఓ వ్యక్తి మృతి చెంది పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు గ్రామానికి చెందిన బి.థామస్‌గా(42) గుర్తించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై ఇన్‌చార్జి రైల్వే ఎస్ఐ రమేష్‌కు సమాచారం ఇచ్చినట్లు స్టేషన్ ఎస్ఐ సురేష్ తెలిపారు. కాగా మృతదేహాన్ని నరసరావుపేట మార్చురీకి తరలించామని ఇన్‌చార్జి రైల్వే ఎస్ఐ రమేష్ తెలిపారు. మృతికి సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉందని చెప్పారు.

విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి



ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు రవి

తాడికొండ: ప్రజలకు పెనుభారంగా మారే స్మార్ట్ మీటర్లను నిలిపివేసి విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి కోరారు. సోమవారం తుళ్ళూరు మండలం మందడంలో ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ అవినీతిపరుడు గౌతమ్ అదానీతో తమిళనాడు ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాలన్నింటినీ రద్దు చేసుకున్నట్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రద్దు చేసుకోవాలన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడులకు లొంగి విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.15,450 కోట్ల విద్యుత్ భారాన్ని మోపిందని, రూ.12,771 కోట్ల లోటు వచ్చిందని మరలా ట్రూ అప్ చార్జీలను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా పెంచుతుందన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థల వారిని భయపెట్టి ఇప్పటికే స్మార్ట్ మీటర్లను బిగించారని, వినియోగదారుల అనుమతి లేకుండా పెట్టేందుకు ప్రయత్నిస్తే వినియోగదారులు అడ్డగించాలని, సిబ్బంది దౌర్జన్యంగా స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రయత్నిస్తే పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు నండూరి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

తాడేపల్లి రూరల్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసే ఇద్దరు నిందితులను తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిర్రావూరుకు చెందిన మామిళ్ళపల్లి శశికాంత్, పుత్రపల్లికి చెందిన తుర్పంటి భరత్ కుమార్‌లు ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తుంటారు, వీరిపై పలు కేసులున్న నేపథ్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి చిర్రావూరులో కాపు కాసి ఆదివారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇద్దరినీ విచారించగా శశికాంత్, తాతా ప్రసాదరావు బైక్ దొంగతనాలు చేస్తున్నట్లు, భరత్‌కుమార్ గంజాయి కేసులో అరెస్టై జైలుకు వెళ్లినప్పుడు అక్కడ శశికాంత్, ప్రసాద్‌లు పరిచమయినట్లు తెలిసిందన్నారు. జైలు నుంచి వచ్చిన అనంతరం తాళం వేసి ఉన్న ఇళ్ళల్లో, బైక్‌లు దొంగతనాలు చేస్తున్నారు. సీఐ వీరేంద్రకుమార్, ఎస్ఐ ప్రతాప్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ సురేష్‌కుమార్, కానిస్టేబుళ్ళు రమేష్, పరమేష్, ప్రసాదరావులు బృందాలుగా ఏర్పడి నిందితులను అరెస్ట్ చేశారు.

కొత్త సెల్‌ఫోన్లు ఇవ్వాలంటూ వినతి



ఫిరంగిపురం: అంగన్‌వాడీలకు గతంలో ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రభుత్వం కొత్త సెల్‌ఫోన్లు ఇవ్వాలంటూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం సీడీపీవో అనూరాధకు నూతన ఫోన్లు ఇప్పించాలంటూ సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేసి తమ సెల్‌ఫోన్లను అందజేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీలు పనిచేయని తమ సెల్‌ఫోన్లను సంబంధిత సూపర్‌వైజర్లకు అందజేసినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రజని, ధనలక్ష్మీ, విజయ, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్ఎం వలి పాల్గొన్నారు.

